క్లుప్తంగా

దివ్యశ్రీకి అభినందనలు



దివ్యశ్రీని అభినందిస్తున్న అధ్యాపకులు

మల్కాపురం: గత నెల 26వ తేదీన న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థి(ఎన్ఎస్ఎస్) దివ్యశ్రీ పాల్గొని అక్కడ పెద్దల అభిమానాలు పొందారు.అందుకు గానూ ఆ విద్యార్థినిని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి అభినందించారు. కళాశాల కీర్తిని ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లిన దివ్యశ్రీ భవిష్యత్తులో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు.

12న ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సంపత్ వినాయకుడు

కంచరపాలెం: కంచరపాలెం పరిధి తిక్కవానిపాలెం కాలనీలో సంపత్ వినాయక పార్వతీ విశ్వేశ్వరసాయి ఆలయ 25వ వార్షికోత్సవం కాలనీ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12 బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామాధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఆ రోజు ఉదయం ఆలయంలో ఆయా దేవతా మూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, రుద్రహోమం, పూర్ణాహుతి, కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామివారి తిరువీధి ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనే దంపతులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని గనగల శంకర్ తెలిపారు. ఇప్పటికే ఆలయాన్ని సుందరంగా అలంకరించే రంగులు, విద్యుత్‌లైట్ల పనులు జరుగుతున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

వికసిత్ భారత్‌కు బడ్జెట్‌లో ప్రత్యేక స్థానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రేమకుమారి

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్‌కు దోహదపడుతుందని మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి అన్నారు. కళాశాల ఆవరణలో బడ్జెట్–రూపురేఖలు అనే అంశంపై మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా ఉందన్నారు. రూ. 20 వేల కోట్లు ప్రైవేట్ రంగంలో పరిశోధనలకు,అభివృద్ధికి,నవ కల్పనలకు కేటాయించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. కళాశాల ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు బి.పి.రాజు బడ్జెట్‌లో రూపాయి రాక–పోకల గురించి వివరించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌క్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన కార్యవర్గం

ఉక్కునగరం: ఉక్కు కనిష్ట అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం (స్టీల్‌క్లబ్) నూతన కార్యవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించింది. గత పాలకవర్గం కాలపరిమితి ముగియడంతో ఇటీవల ఎన్నికలు నిర్వహించారు. గెలిచిన నూతన కమిటీ క్లబ్ అధ్యక్షుడు, స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జనరల్ మేనేజర్ ఎం. మధుసూదన రావు సమక్షంలో కార్యదర్శిగా పెంటకోట రామకృష్ణ , సంయుక్త కార్యదర్శిగా వై. రవికుమార్, కోశాధికారిగా డి. వేణుగోపాల్, కార్యవర్గ సభ్యులుగా పి.ఆర్.ఎస్. సాయిరవి, కె. రంగనాథం, ఎం. వెంకటరాజు, బి వెంకటరమణ, జె. రమేష్ కుమార్, రమేష్, వి. నాగభూషణరాజులు బాధ్యతలు స్వీకరించారు. క్లబ్ సభ్యుల సౌకర్యార్థం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

పొంచి ఉన్న ముప్పు.. కలగని కనువిప్పు!

ఆ మార్గంలో ప్రయాణం అంటే హడలి పోతున్నారు. కిలోమీటరు పరిధిలో భారీ వాహనాలు నిలపడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు నడవడానికి అవకాశం లేకుండా పోతుంది. వాహనాలు తప్పించే క్రమం తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అయినా అధికారులకు కనువిప్పు కలగడం లేదని వాహన చోదకులు మండిపడుతున్నారు.



మల్కాపురం కేంద్రీయ విద్యాలయం గేటు ఎదురుగా నిలిపిన భారీ వాహనాలు

- రోడ్లపై భారీ వాహనాల పార్కింగ్
- పరిశ్రమలకు చెందిన వాహనాలూ రోడ్ల వెంబడే..
- మల్కాపురం–సింథియా మార్గంలో నిత్యం నరకం
- ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు శూన్యం



వాహనాలు నిలపడంతో రోడ్డు మధ్యలో నడక సాగిస్తున్న ప్రజలు

సింథియా: మల్కాపురం నుంచి సింథియా వెళ్లే ప్రధాన రహదారిలో కొందరు వాహనచోదకులు నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు రోజుల తరబడి నిలిపేస్తున్నారు. రాత్రి వేళ వాటిని గమనించని ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా గాజువాక నుంచి శ్రీహరిపురం, మల్కాపురం మీదుగా సింథియా వెళ్లే మార్గాలు రద్దీగా ఉంటాయి. శ్రీహరిపురంలో కోరమాండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, మల్కాపురంలో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఆంధ్ర పెట్రోకెమికల్స్ వంటి పరిశ్రమలకు నిత్యం మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

యాజమాన్యాల నిర్లక్ష్యం వల్లే ఇక్కట్లు

ఆయా పరిశ్రమలకు వచ్చే వాహనాలకు ఆ సంస్థలు పార్కింగ్ స్థలాలు కేటాయించాలి. ఆ పని చేయక పోవడంతో ఆ వాహనాలన్నీ రోడ్లపై పార్కింగ్ చేసి రోజులు తరబడి ఉంచడంతో ట్రాఫిక్ స్తంభించి స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఫిర్యాదులు చేసినా పోలీసు అధికారులు దృష్టి సారించకపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది.

జరిమానాలతో సరి

రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న భారీ వాహనాలకు ఎప్పటికప్పుడు జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. పరిశ్రమల యాజమాన్యాలతో సంప్రదింపులు జరిపిన పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని సూచించినా స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మార్గంలో ఉన్న పెట్రోల్ బంకుల నిర్వాహకులు కూడా బంకు నుంచి రోడ్డు మార్గానికి సర్వీసు రోడ్లు వేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు.

అన్నింటికీ రోడ్లే ఆధారం

పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలను రోజుల తరబడి రోడ్డుపైనే పార్కింగ్ చేసి ఉంచడంతో పాటు డ్రైవర్లు, క్లీనర్లు రోడ్ల మీదే స్నానపానాలు, వంటావార్పు వంటి దైనందిన కార్యకలాపాలు చేసుకుంటున్నారు. ఫలితంగా ఈ మార్గంలో వచ్చి పోయే వాహనాలకు ఇబ్బందిగా మారుతోంది. వీధి దీపాలు సైతం సరిగ్గా వెలగకపోవడంతో అటుగా ప్రయాణించే వారు నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలను పార్కింగ్ చేసి ఉంచడం వల్ల ఫుట్‌పాత్ మీద నడవాల్సిన ప్రజలు రోడ్డు మధ్యలో నడుస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ప్రధాన రహదారిపై పార్కింగ్ చేసిన వాహనాలు



వాహనాలను నిరోధించాలి

మల్కాపురం నుంచి సింథియా వరకు ప్రధాన రహదారిపై భారీ వాహనాలు పార్కింగ్ చేయకుండా నిరోధించాలి. రాత్రి వేళ ఈ మార్గంలో ప్రయాణమంటే భయపడి ఆగిపోతున్నాం. వీధిలైట్లు సైతం లేకపోవడంతో ప్రమాదాలు జరిగి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాం. పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో ఒక పక్క సతమతమవుతుంటే, మరో పక్క ఇలా భారీ వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు జరిగి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జీవీఎంసీ, రహదారిభద్రత, ట్రాఫిక్ పోలీస్ అధికారులు కూడా పట్టనట్టుగా వ్యవహరించడం సరికాదు.

– ఎ. సూర్యనారాయణ, ప్రయాణికుడు, శ్రీహరిపురం

తరచూ ఇబ్బందులు



మల్కాపురం నుంచి సింథియా వరకు ఉన్న ప్రధాన రహదారిపై పరిశ్రమలకు వచ్చే భారీ వాహనాలు పార్కింగ్ చేసి ఉండడంతో సాధారణ వాహనాల రాకపోకలకు తరచూ ఇబ్బందిగా ఉంది. రోజుల తరబడి పార్కింగ్ చేసి వదిలేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడమే కాకుండా చుట్టపక్కల ఉంటున్న వారికి సైతం సమస్యగా మారుతోంది. నెల రోజుల కిందట పొగమంచు వల్ల వాహనాలు కనిపించక అటుగా వెళ్తున్న నేను లారీని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగి కాలికి గాయమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కృష్ణారావు, మల్కాపురం

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పోస్టర్ ప్రదర్శిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

మల్కాపురం: ప్రతి ఒక్కరు నిత్యం పౌష్టికాహారం తీసుకోవాలని.. వంటింటి వ్యర్థాలను ఎరువుగా తయారు చేసుకోవాలని సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ డి.రిషాబ్ అన్నారు. ఆరోగ్యకరమైన జీవితం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీఐఎస్ఎఫ్ అధికారుల ఆధ్వర్యంలో మల్కాపురం వద్ద మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమాండెంట్ రిషాబ్ మాట్లాడుతూ ప్రకృతి ఆధారంగా కూరగాయలు,ఆకుకూరలు,పండ్లు పండించేందుకు అంతా శ్రమించాలన్నారు. రసాయనాలు పూసిన పదార్థాలు తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు.నిత్యం జ్ఞానం,యోగా, ఆరోగ్యకరమైన భోజనం తీసుకుంటే మనిషి జీవనం ఆరోగ్యకరంగా, సంతోషంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్అండ్ టీ అధికారి రాజు

మల్కాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చి సీఎస్సార్ నిధులు ఖర్చు చేస్తున్నామని ఎల్అండ్‌టీ సంస్థ అధికారి డీవీఎస్ఎన్‌రాజు అన్నారు. 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు డ్యూయల్ డెస్క్ బెంచీలు, ఇతర సామగ్రి మంగళవారం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్. అరుణకుమారి మాట్లాడుతూ ఎల్అండ్ టీ సంస్థ విద్యార్థుల ఆరోగ్యంతో చదువు కోవడానికి వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. తరచూ రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు రక్తహీనతో బాధపడుతున్న విద్యార్థులకు అవసరమైన సాయం అందించడం మంచి పరిణామమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బి.వి.ఎస్.కుమార్,రామారావు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఊర్వశి జంక్షన్ కూడలి రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్యస్వామికి ఆలయ అర్చకులు రామకృష్ణశర్మ స్కంద పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

సర్వేలు పక్కాగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీవో డాక్టర్ పూర్ణేంద్రబాబు

కంచరపాలెం: ప్రజలు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు అప్పగించిన సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని డీటీసీవో డాక్టర్ పూర్ణేంద్రబాబు సూచించారు. క్షయ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆర్పీపేట ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మట్టా శశిప్రియాంక ఆధ్వర్యంలో జరిగిన ఆశా–డే సమావేశానికి పూర్ణేంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు లెప్రసీ, క్షయ వ్యాధులపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీ భారతీ, టీబీ హెచ్‌వీ నూనెల పైడిరాజు, ఎల్‌టీ పూర్ణిమ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు

సింథియా: అయోధ్యలో దళిత యువతిపై అత్యాచారం చేసి చంపిన నిందితులను వెంటనే అరెస్ట్ ఉరి తీయాలని ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవ గ్రామంలో మంగళవారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గుడాల జయ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం వచ్చి 76 ఏళ్లు గడుస్తున్నా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత యవతిపై అత్యాచారం జరిపి, చంపిన నిందితులను వెంటనే ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు పందిరి జయలక్ష్మి, ముత్యాలమ్మ, అచ్చియమ్మ, రమ, నాగమణి, బోనుల అచ్చమ్మ, రమ, పావని తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం నాటకాలు

సీఐఎస్ఎఫ్ సిబ్బంది కుదింపుపై ఆందోళన



దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ ప్రతినిధులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్ర ప్రభుత్వం నాటకాలు ఆడుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే కర్మాగారంలో అతి కీలకమైన సీఐఎస్ఎఫ్ విభాగంలో వందలాది మంది సిబ్బందిని ప్రభుత్వం తొలగించిందని ఆయన పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1454 రోజులకు చేరుకున్నాయి. శిబిరాన్ని సందర్శించిన ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వం నేటికీ స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. 463 మంది సీఐఎస్ఎఫ్ సిబ్బందిని వేరే ప్రాంతాలకు బదిలీ చేయడం అన్యాయం అన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగార రక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బందిని తొలగించడం ఎంత వరకూ సమంజసం అని ప్రశ్నించారు. ఇటువంటి చర్యల వల్ల ఉక్కు ఉద్యోగుల మనోభావాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు తప్పుడు విధానాలు విడనాడి ఉక్కు కర్మాగార ప్రగతికి నడుంబిగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఎంకేవీ రాజేశ్వరరావు, జి. ఆనంద్, రమేష్, నంబారి సింహాద్రి, ఎం. త్రినాథ్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమకు దారేది షూటింగ్ ప్రారంభం



చిత్ర బృందంతో నిర్మాత బాలరాజు

గోపాలపట్నం: జయవతి ఆర్ట్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రేమకు దారేది చిత్రం తీయనున్నట్టు దర్శకుడు పీకే నాయుడు తెలిపారు. ఈ మేరకు గణేష్‌నగర్‌లోని ఆయన ఇంటి వద్ద నిర్మాత బాలరాజు క్లాప్‌కొట్టి షూటింగ్‌ను ప్రారంభించినట్టు చెప్పారు. సినిమాలో కథానాయకుడిగా మక్కా శ్రీను, కథానాయకిగా సుప్రియను పరిచయం చేస్తున్నామని తెలిపారు.

దుర్వాసన ఎక్కడి నుంచి వచ్చిందో!

- అంతుపట్టని వైనం
- కుదుట పడిన విద్యార్థుల ఆరోగ్యం



విద్యార్థులతో కలసి భోజనాలు చేస్తున్న డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, హెచ్ఎంలు



దుర్వాసన వచ్చిన గది ఎగువ అంతస్తులో ఉన్నది ఇదే



తరగతి గదికి సమీపంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

గోపాలపట్నం: హెచ్‌సీ వెంకటాపురం పాఠశాల విద్యార్థులను అస్వస్థతకు గురి చేసిన దుర్వాసన ఎక్కడి నుంచి వచ్చిందో అంతు చిక్కడం లేదు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో దుర్వాసనకు గల కారణాలు కనిపించడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కుళ్లిన కోడిగుడ్లు తరగతిగది సమీపంలో వేయడం వల్ల ఈ దుర్వాసన వచ్చిందని వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కోడిగుడ్లు శుక్రవారం వచ్చాయని ఇందులో కుళ్లినవి ఏమీ లేవని చెబుతున్నారు.

అక్కడ నుంచేనా..

గతంలో టిడ్కోఇళ్లు నిర్మించేందుకు వచ్చిన కూలీలు ఉండేందుకు షెడ్లు వేశారు. వాటితో పాటు మరుగుదొడ్లు నిర్మించారు. షెడ్లు తొలగించినా ఈ టాయ్‌లెట్లను తొలగించలేదు. ఇవి పాఠశాలకు సమీపంలో ఉండడం వల్ల దుర్వాసన వచ్చి ఉండవచ్చని కొందరు అనుమానిస్తున్నారు. వాటిని తక్షణమే తొలగించాలని విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిశీలించిన డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు

విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు మంగళవారం పాఠశాలను పరిశీలించారు. దుర్వాసన ఎలా వచ్చిందనే అనే విషయంపై ఆరా తీశారు. విద్యార్థులతో మాట్లాడానని పాఠశాలలో ఇబ్బంది లేదని వెల్లడించారు. శనివారం ఓ విద్యార్థి బయట నుంచి వచ్చినపుడు ఏదో తొక్కి వచ్చాడని, అందువల్ల దుర్వాసన వచ్చిందని విద్యార్థులు తెలిపారన్నారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

శుభ్రం చేసిన పారిశుధ్య కార్మికులు

అపారిశుధ్యం వల్ల దుర్వాసన వచ్చిందనడంతో జీవీఎంసీ 92వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పందించి తరగతి గదితో పాటు పరిసరాలు, మరుగుదొడ్లను శుభ్రం చేయించారు. బ్లీచింగ్ చల్లారు.

పాఠశాలను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

విద్యార్థులు వాంతులు చేసుకుని అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు మంగళవారం హెచ్‌సీ వెంకటాపురం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. ప్రతీ రోజు తరగతి గదులను శుభ్రం చేయాలని సూచించారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు పి. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్‌కు చెక్



క్యాన్సర్ లోగోను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: బెహరా కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నరవలోని బెహరా నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిందుమతి విద్యార్థులకు క్యాన్సర్‌పై పలు అంశాల్లో సందేహాలను నివృత్తి చేశారు. క్యాన్సర్ ప్రాథమిక లక్షణాలు ఏవిధంగా ఉంటాయో వివరించారు. అవగాహనతో చెక్ పెట్టవచ్చునని చెప్పారు. క్యాన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా లోగోను ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనూషా ప్రియ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ దివ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

అప్పికొండ తీరంలో భారీ ఏర్పాట్లు

పెదగంట్యాడ: అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో పి.శ్రీలేఖ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26న శివరాత్రి రోజున ఇక్కడకు భారీ ఎత్తున భక్తులు తరలి వస్తారన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహించాలన్నారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని శుభ్రం చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. భక్తుల కోసం పకడ్బందీగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ వారు ప్రత్యేకంగా బస్సులు నడపాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ ఈవో శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌భాస్కర్, దువ్వాడ సీఐ కె. మల్లేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు, నాయకులు శివకుమార్, ఎంపీ రెడ్డి, అప్పలరెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు వనము అప్పలనాయుడు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.